20 NOV 2020

**SAKSHI**

# మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి ఘన నివాళి

యానాం: దివంగత మాజీ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ జయంతిని యానాంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బైపాస్ రహదారిలోని ఇందిరాగాంధీ కాంస్యవిగ్రహానికి ఇన్‌చార్జి ఆర్‌ఏఓ గుబ్జు గౌరీసరోజ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గౌరీసరోజ మాట్లాడుతూ దేశ తొలి మహిళా ప్రధానిగా దేశాభివృద్ధికి, పేదరికం రూపుమాపేందుకు తన జీవితాన్నే త్యాగం చేసిన ఇందిరాగాంధీ సేవలు భావితరాలు గుర్తుపెట్టుకుంటాయని పేర్కొన్నారు. అదేవిధంగా మిని సివిల్ స్టేషన్ సమీపంలో ఉన్న ఇందిరాగాంధీ విగ్రహానికి సైతం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐ గూటం శివగణేష్, పీఆర్‌ఏ కాళ్ల సత్యనారాయణ, పువ్వల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



యానాంలో ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జి ఆర్‌ఏఓ సరోజ తదితరులు

**సేవలు చిరస్మరణీయం ..**

ముమ్మిడివరం: భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పోలమ్మ చెరువు వద్ద గల బుద్ధపార్కులో ఇందిరాగాంధీ చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రధానిగా ఇందిరాగాంధీ బడుగు, బలహీన వర్గాలకు చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పి.ఉదయ భాస్కరవర్మ, వడ్డి నాగేశ్వరరావు, వేగిశ్న నరసింహరాజు, ముషిణి శివప్రసాద్,మెండి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

## చైల్డ్‌లైన్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

యానాం: చైల్డ్‌లైన్ దోస్తీ వారోత్సవాల్లో భాగంగా గురువారం చైల్డ్‌లైన్ ఆధ్వర్యంలో బాలలహక్కుల రక్షించాలని కోరుతూ బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా చైల్డ్‌లైన్ కార్యాలయం వద్ద కో-ఆర్డినేటర్ రాము పచ్చజెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైల్డ్‌లైన్ వారోత్సవాలు దేశమంతటా అన్ని చైల్డ్‌లైన్ శాఖలు ఒకే అంశంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాయని అన్నారు. ముఖ్యంగా బాల్యవివాహాల నిర్మూలన, బాలల భిక్షాటన చేయడం, వెట్టిచాకిరి, బాలకార్మిక వ్యవస్థ పై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

## 2,052కు చేరిన కోవిడ్ కేసులు

యానం: నియోజకవర్గ పరిధిలో గురువారం వరకు మొత్తం కోవిడ్-19 పాజిటివ్ కేసులు 2,052కు చేరుకున్నాయని పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మెట్టకూరు కోవిడ్ ఆసుపత్రి, జీజీహెచ్ ఐసోలేషన్‌వార్డుల్లో చికిత్సపొంది డిశ్చార్జి అయినవారు మొత్తం 1,977 మంది ఉండగా హోమ్ ఐసోలేషన్‌లో 19 మంది, జీజీహెచ్ లో 12మంది ఉన్నారని ఇప్పటివరకు కరోనాతో 44 మంది మృతి చెందారని తెలిపారు. పుదుచ్చేరి వ్యాప్తంగా 36,533 పాజిటివ్ కేసులు నమోదుకాగా 35,254మంది ఆరోగ్యవంతంగా డిశ్చార్జి అయ్యారని, 421మంది హోమ్ ఐసోలేషన్‌లోను, 249మంది ఆసుపత్రుల్లోను చికిత్సపొందుతున్నారని 609మంది మృతిచెందారని తెలిపారు.

## నేటి నుంచి రైల్వే రిజర్వేషన్ కౌంటర్ ప్రారంభం

యానాం: నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాల ప్రయాణికులకు ఎంతగానో ఉపకరిస్తున్న యానాం దక్షిణమధ్య రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను శుక్రవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు సంబంధిత అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కోవిడ్-19 నేపథ్యంలో సుమారు 9 నెలల పాటు మూతపడిన స్థానిక మినీసివిల్‌స్టేషన్‌లోని రైల్వేరిజర్వేషన్ కౌంటర్ సుదీర్ఘ విరామం తర్వాత తెరుచుకోనుంది. నెలల పాటు మూసివేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతుండటంతో సమస్యను మంత్రి మల్లాడి కృష్ణారావు రైల్వే అధికారులు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో అధికారులు స్పందించి రైల్వేరిజర్వేషన్ కౌంటర్‌ను తెరుస్తుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

**ENADU**

20 NOV 2020

## సాయం దుర్వినియోగం కాకుండా చర్యలు

**యానాం:** పుదుచ్చేరి వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా అమలుచేస్తున్న పింఛన్ల పంపిణీలో నిధులు దుర్వినియోగం అవుతున్నట్లు గుర్తించామని, వాటి అడ్డుకట్టకు చర్యలు చేపట్టామని లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడి తెలిపారు. నిజమైన అర్హులను గుర్తించేందుకు బృందాలను ఏర్పాటు చేస్తున్నామని, దీని వల్ల 60 శాతం ప్రజాధనం ఆదా అయ్యే అవకాశం ఉందన్నారు.

## రైల్వే రిజర్వేషన్ కౌంటర్ నేడు పునః ప్రారంభం

**యానాం:** కరోనా నేపథ్యంలో యానాంలో మూతపడిన రైల్వే రిజర్వేషన్ కౌంటర్ శుక్రవారం నుంచి పునః ప్రారంభం కానున్నట్లు ఆరోగ్యశాఖమంత్రి మల్లాడి కృష్ణారావు తెలిపారు.

**ANDHRA JYOTHI**

20 NOV 2020

## రైల్వే రిజర్వేషన్ కౌంటర్ నేడు పునః ప్రారంభం

యానాం, నవంబరు 19: యానాం రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను శుక్రవారం నుంచి పునఃప్రారంభిస్తున్నట్లు పుదుచ్చేరి ఆరోగ్య శాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు తెలిపారు. కొవిడ్ కారణంగా ఇప్పటివరకు ఈ కౌంటర్‌ను మూసివేసిన విషయం తెలిసిందే. అయితే ఆంక్షల సడలింపుతో ప్రజాజీవనం సాధారణ స్థితికి చేరుకుంది. అయినా కౌంటర్‌ను తెరవకపోవడంతో రైలు, టికెట్ల కోసం యానాం ప్రజలు కాకినాడ వెళ్లాల్సి వస్తోంది. దీనిపై స్పందించిన మంత్రి మల్లాడి హైదరాబాద్, విజయవాడ రైల్వే ఉన్నతాధికారులతో చర్చించి టికెట్ల కోసం ప్రజలు పడుతున్న ఇబ్బందులను వారి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి చొరవతో అధికారులు స్పందించి శుక్రవారం ఈ కౌంటర్‌ను తెరుస్తామని ప్రకటించారు. తొమ్మిది నెలల అనంతరం రిజర్వేషన్ కౌంటర్ అందుబాటులోకి రానుండడంతో ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

20 NOV 2020



## ఇందిరా గాంధీకి ఘన నివాళి

యానాం (ఇండస్ విజన్ న్యూస్): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా యానాంలోని ఆవిడ విగ్రహానికి గురువారం పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక బైపాస్ 216 జాతీయ రహదారిపై గల ఇందిరాగాంధీ విగ్రహానికి ఇంచార్జ్ పరిపాలనాధికారి జి గౌరీ సరోజ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆవిడ చేసిన సేవలను పలువురు వక్తలు కొనియాడారు. సమాచార ప్రసార శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఐ గూటం గణేష్, ఏ ఈ మేడిశెట్టి రామలింగేశ్వరరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మట్టపర్తి సుబ్బారావు, పిఆర్‌వి కాళ్ళ సత్యనారాయణ పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు.

## జాతీయ సమైక్యత ప్రతిజ్ఞ



యానాం (ఇండస్ విజన్ న్యూస్): యానాం పోలీస్ శాఖలో గురువారం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని జాతీయ సమైక్యత దినోత్సవం నిర్వహించారు.స్థానిక పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఎస్పి భక్తవత్సలం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐలు, ఏఎస్సైలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు దేశం యొక్క స్వేచ్ఛ, సమగ్రతను కాపాడటానికి, బలోపేతం చేయడానికి అంకితభావంతో పని చేస్తామని జాతీయ సమైక్యత ప్రతిజ్ఞను చేశారు. ఈ కార్యక్రమంలో సిఐ గూటం శివ గణేష్, ఎస్సైలు, అల్ఫన్స్ రాజు, షేరు నూకరాజు పాల్గొన్నారు.

PRAJA SAKTHI

20 NOV 2020

## నేటి నుంచి రైల్వే రిజర్వేషన్ కౌంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - యానాం

కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నియోజకవర్గంలో శుక్రవారం నుంచి ప్రయాణికులకు అందుబాటులో రైల్వే రిజర్వేషన్ కౌంటర్ అందుబాటులోకి రానుంది. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ ఉన్నతాధికారులతో పుదుచ్చేరి ఆరోగ్యశాఖమంత్రి మల్లాడి కృష్ణారావు మాట్లాడారు. ఈ మేరకు స్పందించిన అధికారులు కౌంటర్ ఏర్పాటుకు అనుమతులు జారీ చేశారు.